## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం






ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 62 మంగళవారం 30 జూన్ 2026 పేజీలు - 4 వెల :2/-





# అప్పుడు కొట్టండి మీ నాయకుడికి జేజేలు..!

## చేర్యాల లోని సమస్యలు మచ్చుకు కొన్ని






నిర్మాణం పూర్తయినా తెరుచుకోనీ షెటర్లు










చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని 2016 నుండి పోరాటం చేస్తున్న ప్రజలు

**-సాధారణ నిధులు కాదు.. చేర్యాల అస్తిత్వం కోసం ప్రత్యేకంగా ఏం సాధించారో చెప్పండి!**

**సామాన్యుడి వేదన**

**-ఒకప్పుడు నియోజకవర్గం.. నేడు కనీసం 'రెవెన్యూ డివిజన్' కూడా లేని దుస్థితి.. ఎవరిది అసమర్థత?**

**-అసంపూర్ణ భవనాలు, మాయమైన మార్కెట్ ఆదాయం, డాక్టర్లు లేని ఆసుపత్రి..**

**-చేర్యాల పతనంపై 'హిందూస్థాన్ మీడియా' ప్రత్యేక విశ్లేషణాత్మక కథనంలి!**

చేర్యాల (హిందూస్థాన్ మీడియా):

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలకు, మండలాలకు ఇచ్చే సాధారణ నిధులను (=వస్త్రబశ్రీఖతీ ఖీబఅంం) చూపిస్తూ.. ఇవన్నీ మా నాయకుడి వల్లే వచ్చాయి.. మా నాయకుడే తెచ్చాడని సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకునే మేధావులారా.. ఒక్కసారి మీ గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి. ఆ నిధులు మీ నాయకుడు ఉన్నా వస్తాయి.. ఊడిపోయినా వస్తాయి. చేర్యాల ప్రాంతానికి ప్రత్యేకంగా మీ నాయకుడు సాధించిన ఘనత ఒక్కటైనా ఉందా? ఇక్కడి పట్టిపీడిస్తున్న సమస్యలపై కనీసం ఒక్కదానికైనా పరిష్కార మార్గం చూపించారా? చేర్యాల ప్రజల అమాయకత్వం, అధికారుల అలసత్వం, నాయకుల సమన్వయ లోపం విరసి.. ఒకప్పటి చారిత్రక నియోజకవర్గం నేడు అన్యాయానికి గురవుతూనే ఉంది. మీ సంబరాలు ఆపి, ఈ క్రింది వాస్తవాలను గమనించి, ఆ తర్వాత కొట్టండి మీ నాయకుడికి జేజేలు!"

**-1. ఏళ్ళు గడుస్తున్నా పూర్తికాని 'ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్'**

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగి చేర్యాల ప్రాంతం సిద్దిపేట జిల్లాలో కలిసిన సందర్భంలో ఎంతో ఆర్భాటంగా 'ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్' భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏళ్ళు గడుస్తున్నా ఆ భవనం నేటికీ అసంపూర్తిగానే మురికికూపంగా మిగిలిపోయింది. మొదట ఆ నిర్మాణాన్ని పూర్తి చేయించి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోటకు తెచ్చి ప్రజల తిప్పలు తప్పించండి.. అప్పుడు చెప్పుకోండి ఇది మా నాయకుడి ఘనత అని!

**-2. మార్కెట్ షట్టర్లు కూల్చేశారు.. ఆదాయానికి గండి కొట్టారు!**

ఒక పాత కట్టడాన్ని కూల్చుతున్నామంటే.. అంతకంటే బలమైన, మున్సిపాలిటీకి ఆదాయాన్నిచ్చే నూతన నిర్మాణాన్ని చేపట్టాలి. కానీ చేర్యాల మార్కెట్ యార్డ్‌లో పటిష్టంగా ఉండి, మున్సిపాలిటీకి అద్దెల రూపంలో ఆదాయాన్నిచ్చే దుకాణాల సముదాయాన్ని (మార్కెట్ షట్టర్లను) ఇష్టారాజ్యంగా కూలగొట్టారు. నేడు అక్కడ ఎందుకూ పనికిరాని నిర్మాణం చేపట్టి, మిగతా ఖాళీ స్థలాన్నంతా చెత్తకుప్పల నిలయంగా మార్చారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడం ఇక్కడి నాయకులకే చెల్లింది. ఇప్పటికైనా అక్కడ ఆధునిక కాంప్లెక్స్ నిర్మించి, మున్సిపాలిటీకి ఆదాయం పెంచి మీ నిబద్ధతను నిరూపించుకోండి.. అప్పుడు కొట్టండి మీ నాయకునికి జేజేలు!

**-3. మున్సిపాలిటీ అయ్యింది.. కానీ 'సొంత ఇల్లు' లేదు!**

మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చేర్యాల.. నేడు మున్సిపాలిటీగా ప్రమోషన్ పొందింది. మున్సిపాలిటీగా మారినందుకు గొప్పలు చెప్పుకునే పాలకులు, కనీసం మున్సిపల్ కార్యాలయానికి ఒక సొంత భవనాన్ని కూడా నిర్మించలేని చేతకాని స్థితిలో ఉన్నారు. ముందుగా చేర్యాల మున్సిపాలిటీకి అన్ని వసతులతో కూడిన సొంత అడ్మినిస్ట్రేటివ్ భవనం నిర్మించండి.. అప్పుడు కొట్టండి మీ నాయకుడికి జేజేలు!

**-4. కార్పొరేట్ భవనం సరే.. 'కార్పొరేట్ వైద్యం' ఎక్కడ?**

చేర్యాలలో కోట్లాది రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించారు, సంతోషం. కానీ, కేవలం రంగుల భవనాలు ఉంటే సరిపోతుందా? అందులో ప్రాణాలు కాపాడే వైద్యం వద్దా?

**డాక్టర్ల కొరత:** ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండే గైనకాలజిస్ట్ లేరు, పిల్లల డాక్టర్ (పీడియాట్రీషియన్) లేరు, డెంటల్ ఎక్విప్మెంట్ ఉన్నా డెంటల్ డాక్టర్ లేరు.

**సౌకర్యాల లేమి:** కనీస స్కానింగ్ యంత్రం లేదు. డయాలసిస్ సెంటర్ ఇదిగో ప్రారంభం, అదిగో ప్రారంభం అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఇప్పటికీ రోగులకు నోచుకోలేదు. ఆసుపత్రిలో ఈ వసతులన్నీ కల్పించి, పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించండి.. అప్పుడు కొట్టండి మీ నాయకుడికి జేజేలు!

**చీకట్లో సెంట్రల్ లైటింగ్.. కరెంట్ లేని గ్రంథాలయం!**

కోట్లాది రూపాయల ఫండ్స్ తెస్తున్నామని చెప్పుకునే నాయకులు.. చేర్యాల ప్రధాన రహదారిపై బిగించిన సెంట్రల్ లైటింగ్ బల్బులను కనీసం వెలిగించలేకపోతున్నారు. రాత్రి వేళల్లో చేర్యాల చీకట్లమయంగా మారుతోంది. ఇక చేర్యాల ప్రభుత్వ గ్రంథాలయం (లైబ్రరీ) పరిస్థితి మరీ ఘోరం.. అక్కడ కనీసం కరెంటు వసతి కూడా లేదంటే ఇక్కడి విద్యావ్యవస్థపై నాయకులకు ఉన్న గౌరవం ఏపాటిదో అర్థమవుతోంది. ఉపయోగంలో లేని ప్రభుత్వ బిల్డింగులు ఎన్నో ఉన్నాయి, వాటిని రిపేర్ చేయించి, దూరంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలను పట్టణంలోకి మార్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి. ఈ సమస్యలు కొన్ని మచ్చుకు మాత్రమే....

**ఫైనల్ డిమాండ్:** 'రెవెన్యూ డివిజన్' నియోజక వర్గం సాధిస్తేనే అసలైన సంబరం! 2016 జిల్లాల పునర్విభజన నాటి నుండి చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం, చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఇక్కడి ప్రజలు, యువకులు పోరాడుతూనే ఉన్నారు. చేర్యాల కేంద్రంగా మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాల ప్రజల ఇబ్బందులు తీరేలా ఎప్పుడు గెలిచి 'రెవెన్యూ డివిజన్' బోర్డు పెడతారో.., నియోజకవర్గం ఎప్పుడు సాధిస్తారో...అప్పుడు మీరు నిజమైన సమర్థవంతమైన నాయకులు! అంతేగానీ, రాష్ట్రమంతటా వచ్చే ప్యాకేజీలను మీ ఖాతాలో వేసుకుని మురిసిపోకండి. చేర్యాలకు ప్రత్యేకంగా ఏదైనా సాధించి, ఆపై సంబరాలు చేసుకోండి.. అప్పుడు ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి మీ నాయకుడికి జేజేలు కొడతారు!

## 7వ వార్డులో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

**-ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం కృషి చేసిన కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ గౌడ్**



**చేర్యాల, జూన్ 28 (హిందుస్థాన్ మీడియా):**
చేర్యాల పట్టణంలోని 7వ వార్డు రాజీవ్ నగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.స్థానిక కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ గౌడ్ సమస్యను గుర్తించి విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేశారు. దీంతో రాజీవ్ నగర్ ప్రాంత ప్రజలకు లో వోల్టేజ్ సమస్య నుంచి ఉపశమనం లభించనుంది.ఈ సందర్భంగా స్థానికులు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ గౌడ్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆడెపు చంద్రయ్య, పోతుగంటి యాదగిరి, వేముల నరసింహులు, పోలోజు ఆంజనేయులు, పాక శ్రీను, నీలం వినయ్, రాములు, జోగు శ్రీధర్, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

**-సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిగా ముందుకొచ్చిన చిలుకూరి కిరణ్**




**చేర్యాల, జూన్ 28 (హిందుస్థాన్ మీడియా):**
జనగామకు చెందిన చిలుకూరి కిరణ్, స్టార్ హెల్త్ సేల్స్ మేనేజర్, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా జడ్పీహెచ్ఎస్ నాగపురి పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.సంఘసేవకుడు, ఉపాధ్యాయుడు అందే విజయ్ కుమార్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిగా తన వంతు సహాయంగా 10 మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 10 నోటుబుక్స్ చొప్పున పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య మాట్లాడుతూ, "మానవ సేవయే మాధవ సేవ" అనే భావనతో పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడంఅభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న చిలుకూరి కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు!

**-లయన్స్ క్లబ్స్ చంద్రశేఖర్ ఆర్య చేతుల మీదుగా ఘన సత్కారం..**




**చేర్యాల (హిందూస్తాన్ మీడియా):**
నిరంతరం సామాజిక సేవ, ఉచిత వైద్య సేవలు, మానవతా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ చేర్యాల ప్రాంత ప్రజల మన్ననలు పొందుతున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ చెరుకు శ్రీనివాస్ కి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (LCIF) అందించే ప్రతిష్ఠాత్మక 'ఉత్తమ ఎల్‌సీఐఎఫ్' పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ వరంగల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వార్షిక మహోత్సవ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య ముఖ్య అతిథిగా హాజరై.. డాక్టర్ చెరుకు శ్రీనివాస్ కి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రదానం చేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

**డాక్టర్ శ్రీనివాస్ సేవలు ఆదర్శప్రాయం: డిస్ట్రిక్ట్ గవర్నర్**

ఈ సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలకు, అవసరమైన వారికి సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆ ఆశయాలకు అనుగుణంగా చేర్యాల ప్రాంతంలో డాక్టర్ చెరుకు శ్రీనివాస్ అందిస్తున్న సేవలు అత్యంత ఆదర్శప్రాయమైనవని కొనియాడారు. వృత్తి రిత్యా వైద్యులైనప్పటికీ.. సామాజిక బాధ్యతతో ఉచిత వైద్య శిబిరాలు, సహాయక చర్యలు చేపట్టడం వల్లే ఈ అంతర్జాతీయ అవార్డు లభించిందన్నారు.

**ఈ గౌరవం ప్రతి లయన్ సభ్యుడిది: డాక్టర్ చెరుకు శ్రీనివాస్**

అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం తన ఒక్కరికే కాకుండా, క్షేత్రస్థాయిలో సేవా కార్యక్రమాల్లో తనతో పాటు అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్క లయన్స్ క్లబ్ సభ్యుడికి దక్కుతుందని వినమ్రంగా ప్రకటించారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో కూడా నిరుపేదలు, , అట్టడుగు వర్గాల వారికి మరింత అంకితభావంతో వైద్య సేవలు అందిస్తూ లయన్స్ క్లబ్ అంతర్జాతీయ ఆశయ సాధనకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.వివిధ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, లయన్స్ ప్రతినిధులు శ్రీనివాస్ ను అభినందించారు.

## అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ

**-సేవలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ గొర్రె శ్రీనివాస్**



**చేర్యాల, జూన్ 29 (హిందుస్థాన్ మీడియా):**
సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని చుంచనకోట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు సోమవారం స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో యూనిఫామ్స్ పంపిణీ చేయగా, గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, బాలామృతం వంటి పోషకాహార పదార్థాలు చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ద్వారా గ్రామాభివృద్ధికి బాటలు పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గీత, షబానా, అంగన్వాడీ టీచర్ బాల నరసవ్వ, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహం వద్ద శ్రమదానం



**బెజ్జంకి, జూన్ 29 (హిందుస్థాన్ మీడియా):**
బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే--సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద సోమవారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ పరిసరాలను శుభ్రపరిచి పరిశుభ్రతను కాపాడేందుకు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో రావుల నర్సయ్య, సంగెం మధు, ఐలేని నర్సింహా రెడ్డి, ఎలిగే సతీష్, బోనగం రమేష్, బోనగిరి రాయలింగం, దేవదాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహనీయుల విగ్రహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చూపిన సామాజిక సంస్కరణల మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని పరిశుభ్రతతో పాటు సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు:

## మద్దూరు ఎస్ఐ అసిఫ్



**మద్దూరు, జూన్ 29 (హిందుస్థాన్ మీడియా):**
ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మద్దూరు ఎస్ఐ అసిఫ్ హెచ్చరించారు. మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకోజు శ్రీశైలం ఇటీవల వాట్సాప్‌లో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా పదేపదే పోస్టులు పెడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అసిఫ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో మంచి ప్రవర్తనతో ఉండాలని, ప్రజల్లో ఉద్రిక్తతలు, అపోహలు సృష్టించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియా వేదికల్లో తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు చేసే వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ అసిఫ్ హెచ్చరించారు.

## డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని మా అనుమానం

**-తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) చీఫ్ కవిత**

**ధర్మఘంట జూన్ 29 హైదరాబాద్:**



దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు.బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని,ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని,వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు.రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని,సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొడంగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని ఫలితాలు వచ్చాయని చెప్పుకొచ్చారు.రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు.ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను పరిశీలించాలని,ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని, ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు.ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

## కేజీబీవీలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**(హిందూస్తాన్‌మీడియా):జూన్29ఉమ్మడిఆదిలాబాద్**
కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో (కేజీబీవీలలో) విద్యార్థులందరికీ మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ గ్రామీణ మండలం అనంతపేట గ్రామంలో గల కేజీబీవీను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణను మొత్తం నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వర్షాకాలం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఇప్పటి వారికి చెప్పిన సబ్జెక్టులను అడిగారు. వాటిల్లో నుంచి పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులతో లెక్కలు చేయించారు. సరిగ్గా లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను నాలుగు జట్లుగా విభజించి, వారితో జంబుల్ వర్డ్స్




అరేంజ్మెంట్ ఆటను ఆడిపించారు. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఉత్సాహం చూపాలన్నారు.వసతి గృహంలో వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి సమస్య ఉందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగానే, స్పందించిన కలెక్టర్ ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ ప్రభాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# క్రీడలు

## పాక్ క్రికెట్‌లో పెను మార్పులు
## షాహీన్ అఫ్రిది, నసీమ్‌లపై వేటు

**స్పోర్ట్స్ డెస్క్:**
పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరికొద్ది రోజుల్లో వెళ్లనున్న వెస్టిండీస్ పర్యటన విషయంలో సంచలన నిర్ణయాలు తీసుకుంది. జులైలో విండీస్‌తో జరగబోయే రెండు టెస్టుల సిరీస్ కోసం పాక్ సెలెక్టర్లు జట్టు పేస్ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. స్టార్ బౌలర్లు షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, హసన్ అలీలతో పాటు సీనియర్ స్పిన్నర్ నౌమాన్ అలీపై వేటు వేశారు. రెండు నెలల క్రితం బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో పాక్ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో సెలెక్షన్ కమిటీ ఈ కఠిన నిర్ణయం తీసుకుందని సమాచారం. సీనియర్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్ ప్రతిపాదించిన 17 మంది సభ్యులతో కూడిన ప్రాథమిక జట్టుకు పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పాక్ క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా ఎలాంటి నిర్ణయాలైనా తీసుకోవచ్చని నఖ్వీ సెలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. సరికొత్త వ్యూహాలతో బరిలోకి దిగుతున్న పాక్ జట్టులో సీనియర్ పేసర్లు మహ్మద్ అబ్బాస్, మహ్మద్ అలీ మళ్లీ పునరాగమనం చేశారు. వీరితో పాటు ఖుర్రమ్ షెహజాద్, యువ ఆల్‌రౌండర్ ఆమీర్ జమాల్ పేస్ దళంలో చేరనున్నారు. కాగా, జట్టు నుంచి తప్పించిన నసీమ్ షా తమ్ముడు, 20 ఏళ్ల అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉబైద్ షాకు సెలెక్టర్లు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం కల్పించడం విశేషం. షాహీన్, నసీమ్ వంటి బౌలర్లు వైట్ బాల్ క్రికెట్‌కే పరిమితమైతే బాగుంటుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. పాక్ జట్టు జూలై 25 నుంచి ట్రినిడాడ్‌లోని బ్రెయిన్ లారా క్రికెట్ అకాడమీలో వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ ఆడనుంది. ఆ



తర్వాత ఆగస్టు 2 నుంచి పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో రెండో టెస్ట్ ప్రారంభమవుతుంది. ఈ విండీస్ పర్యటన ముగిసిన వెంటనే పాకిస్థాన్ జట్టు ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ కోసం బయలుదేరుతుంది. దీనికి సంబంధించి కూడా ఈ వారం లోనే పీసీబీ అధికారికంగా తుది జట్టును ప్రకటించనుంది.

## రిటైర్‌మెంట్ గురించి నన్నెవరూ ఒత్తిడి చేయలేదు.. స్టోక్స్ క్లారిటీ

**ఇంటర్నెట్ డెస్క్:**
ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టు అతడి కెరీర్‌లో చివరిదని వెల్లడించాడు. అయితే స్టోక్స్ అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకోవడంపై అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నైట్‌క్లబ్ వివాదం నేపథ్యంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు రిటైర్‌మెంట్ ప్రకటించాలని స్టోక్స్‌పై ఒత్తిడి తెచ్చిందని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో ఆ వార్తలపై స్టోక్స్ స్పందించాడు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని.. ఎవరూ తనను రిటైర్‌మెంట్ ఇవ్వాలని బలవంతం చేయలేదని స్టోక్స్ స్పష్టం చేశాడు. 'ఈ నిర్ణయం నేను ఒక్కసారిగా తీసుకున్నది కాదు. గతేడాది ఆస్ట్రేలియాలో జరిగిన యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ 4-1 తేడతో ఓడింది. అప్పటి నుంచే మానసికంగా ఒత్తిడికి గురయ్యాను. తిరిగి కోలుకోవడానికి ఎంతో ప్రయత్నించా. కానీ ఫలితం రాలేదు. నన్ను నేను పూర్తిగా అలసిపోయేలా చేసుకున్నా. నైట్‌క్లబ్ వివాదం నాపై ప్రభావం చూపింది. డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చున్న సమయంలో నేను మానసికంగా ఎంతగా అలసిపోయానో అర్థమైంది. నా జీవితంలో ఇలాంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. కానీ గత రెండు వారాలు చాలా



కఠినంగా గడిచాయి' అని స్టోక్స్ వెల్లడించాడు.

**జట్టుకు మేలు జరుగుతుంది..**
నైట్‌క్లబ్ వివాదం తర్వాత న్యూజిలాండ్‌తో రెండో టెస్టుకు స్టోక్స్‌పై వేటు పడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అతడు కౌంటీ జట్టు డర్హామ్ తరఫున ఆడాడు. 'అక్కడ క్రికెట్‌ను ఆస్వాదించగలిగాను. కానీ అంతర్జాతీయ స్థాయికి తిరిగి వచ్చిన తర్వాత ఆ అనుభూతిని పొందలేకపోయాను. అయితే నా రిటైర్‌మెంట్ నిర్ణయంలో కొంత నా స్వార్థం కూడా ఉంది. భవిష్యత్తులో జట్టుకు ఇది మేలు చేస్తుందని ఆశిస్తున్నా. నా జీవితంలో ఎంతో ఇచ్చిన క్రికెట్‌పై ప్రేమ కోల్పోకుండా ఉండాలంటే రిటైర్‌మెంట్ ఇచ్చేందుకు ఇదే సరైన సమయమని భావించా' అని స్టోక్స్ తెలిపాడు.

## అరంగేట్రానికి వైభవ్ సిద్ధంగా ఉన్నాడు కానీ!: భారత అసిస్టెంట్ కోచ్

**ఇంటర్నెట్ డెస్క్:**
భారత్‌పై ఐర్లాండ్ 2-0 తేడాతో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. అయితే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కటే ఈ విషయంపై స్పందించాడు. అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రానికి వైభవ్ పూర్తిగా సిద్ధంగా ఉన్నాడని స్పష్టం చేశాడు. కానీ ఇతర ప్లేయర్ల మాదిరిగానే అతడు కూడా ఎంపిక ప్రక్రియను అనుసరించాల్సి



ఉంటుందని తెలిపాడు. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ర్యాన్ మాట్లాడాడు. 'వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే టీ20 ప్రపంచ కప్ 2026 గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్ వంటి ప్లేయర్ల గురించి కూడా మేము ఆలోచించాల్సి ఉంది. వారిపై నమ్మకం ఉంచి వరుస అవకాశాలు ఇవ్వాలనేదే మా ఆలోచన. అందుకే వైభవ్‌ను ఐర్లాండ్ సిరీస్‌లో ఆడించలేదు. వైభవ్ ఆటను చూడాలని మేమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. కానీ అతడు కూడా మిగతా ఆటగాళ్ల మాదిరిగానే అదే ప్రక్రియలో ముందుకు రావాల్సి ఉంటుంది. సరైన సమయంలో అతడికి తుది జట్టులో చోటు దక్కుతుంది. వైభవ్‌కు గొప్ప భవిష్యత్తు ఉంది' అని ర్యాన్ వెల్లడించాడు. జులై 1 నుంచి భారత జట్టు ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడనుంది. ఈ పర్యటనలో వైభవ్ అరంగేట్రం చేస్తే.. 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తూ, భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన క్రికెటర్‌గా కొత్త చరిత్ర సృష్టించనున్నాడు. అయితే ఐర్లాండ్ పర్యటనలో భారత సీనియర్ ప్లేయర్లు విఫలమైన వేళ.. వైభవ్‌కు తుది జట్టులో లైన్ క్లియర్ అయిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

# బిజినెస్

## నిఫ్టీ 24,000 దిగువకు
## మార్కెట్లపై పశ్చిమాసియా ప్రభావం

- -సోమవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్లకు నష్టాలు
- -సెన్సెక్స్ 372 పాయింట్లు, నిఫ్టీ 109 పాయింట్లు పతనం
- -పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఐటీ, ఆటో రంగాల బలహీనతే ప్రధాన కారణం
- -ఫార్మా, మెటల్ షేర్లు రాణించగా, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో క్షీణత
- -నిఫ్టీకి 23,900 వద్ద మద్దతు, 24,000 వద్ద నిరోధం ఉందని నిపుణుల విశ్లేషణ



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీనికి తోడు ఆటో, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 372.10 పాయింట్లు నష్టపోయి 76,728.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109.75 పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలతో ట్రేడర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు. దీంతో దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సాంకేతిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,000 కీలక నిరోధంగా మారింది. దీనిని దాటితే 24,100-24,200 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దిగువన 23,900 తక్షణ మద్దతుగా, 23,800 బలమైన మద్దతుగా పనిచేస్తుందని వారు తెలిపారు. ఈరోజు ట్రేడింగ్‌లో ఫార్మా, మెటల్, హెల్త్‌కేర్ రంగాలు రాణించగా.. ఆటో, కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు అత్యధికంగా నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం మేర నష్టపోయాయి. రాబోయే రోజుల్లో పశ్చిమాసియా పరిణామాలు, ఇతర అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం
## టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు

- -హర్మూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- -ఆ సమయంలో కేంద్ర తీసుకున్న చర్యలను వివరించిన హర్దీప్ సింగ్ పురీ
- -పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- -దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా ె ఎంచామన్న మంత్రి
- -ఈ చర్యల వల్లే వినియోగదారులపై ప్రభావం పడలేదని వ్యాఖ్య



ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## బీమా కంపెనీల వద్ద రూ.9,000 కోట్లు.. మీ డబ్బు కూడా ఉందేమో చూసుకోండి!




- -బీమా కంపెనీల వద్ద దాదాపు రూ.9,000 కోట్ల క్లెయిమ్ చేయని నిధులు
- -నామినీలకు పాలసీల గురించి తెలియకపోవడమే ప్రధాన కారణం
- -దీర్ఘకాలిక పాలసీలలో చిరునామా, ఫోన్ నంబర్లు మారడం మరో సమస్య

బీమా పాలసీదారులకు, వారి కుటుంబ సభ్యులకు చెందిన దాదాపు రూ.9,000 కోట్ల రూపాయలు లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయాయి. చాలా సందర్భాల్లో నామినీలకు పాలసీ ఉన్న విషయమే తెలియకపోవడం, పత్రాలు పోగొట్టుకోవడం లేదా పాలసీదారులు తమ వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వంటి కారణాలతో ఈ భారీ మొత్తం ఎవరికీ చెందకుండా మిగిలిపోయింది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 ఫిబ్రవరి 28 నాటికి రూ.8,973.89 కోట్ల క్లెయిమ్ చేయని నిధులు బీమా సంస్థల వద్ద ఉన్నాయి. నిబంధనల ప్రకారం, పాలసీ డబ్బు చెల్లించాల్సిన గడువు ముగిసిన 12 నెలల వరకు ఎవరూ క్లెయిమ్ చేయకపోతే దానిని 'అన్‌క్లెయిమ్డ్' మొత్తంగా పరిగణిస్తారు. పదేళ్ల తర్వాత ఈ డబ్బును ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ చేసినప్పటికీ, పాలసీదారులు లేదా వారి వారసులు 25 ఏళ్ల వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుంది. కవర్‌ష్యూర్ వ్యవస్థాపకుడు సౌరభ్ విజయ్‌వర్గియా ప్రకారం, ఎండోమెంట్, మనీ-బ్యాక్ వంటి సంప్రదాయ పాలసీలు 15 నుంచి 30 ఏళ్ల పాటు కొనసాగుతాయి. ఈ సుదీర్ఘ కాలంలో పాలసీదారులు చిరునామా, ఫోన్ నంబర్, నామినీ వివరాలను మార్చడం మర్చిపోతారు. ఇదే అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు పెరగడానికి కారణమవుతోంది. క్లెయిమ్ చేయని నిధుల్లో ఎక్కువ భాగం లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించినదే. ఇందులో మెచ్యూరిటీ డబ్బు, డెత్ క్లెయిమ్స్, సరెండర్ విలువలు, సర్వైవల్ బెనిఫిట్స్ వంటివి ఉన్నాయి. ఇక హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ విషయానికి వస్తే, అసంపూర్తిగా ఉన్న రీయింబర్స్‌మెంట్లు, ప్రీమియం రిఫండ్‌లు, పూర్తికాని క్లెయిమ్ ప్రాసెస్‌ల వల్ల డబ్బు మిగిలిపోతోంది. దాదాపు రూ.9,000 కోట్లు ఇంకా క్లెయిమ్ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, పాలసీదారులు కొన్ని నిమిషాలు కేటాయించి తమ పాత పాలసీలను సమీక్షించుకోవడం, ఆ వివరాలను కుటుంబ సభ్యులకు తెలియజేయడం ఎంతో ముఖ్యం. ఇది వారి ఆత్మీయులకు చెందాల్సిన డబ్బు వృథా కాకుండా కాపాడుతుంది.

# పవన్ కల్యాణ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన పూజా హెగ్డే



**-అవకాశాలు తగ్గి వెనుకబడ్డ పూజా హెగ్డే**

**‘-ఓజీ 2’లో పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు సమాచారం**

**-గతంలో పవన్ సరసన ఛాన్స్ మిస్ అయిన పూజ**

బుట్టబొమ్మ పూజా హెగ్డేకి కొంత కాలంగా అవకాశాలు తగ్గిన సంగతి తెలిసిందే. తాజాగా పూజా హెగ్డే బంపర్ ఆఫర్ కొట్టేసినట్టు ఫిలిం నగర్ టాక్. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఛాన్స్ కొట్టేసినట్టు వార్తలు వస్తున్నాయి. పవన్, దర్శకుడు సుజిత్ కాంబినేషన్లో వచ్చిన ‘ఓజీ’ సినిమా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ‘ఓజీ 2’ తెరకెక్కబోతోంది. ఈ సినిమాలో పూజా హెగ్డేను తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే పూజ లక్కీ ఛాన్స్ కొట్టేసినట్టే. గతంలోనే పవన్, పూజా హెగ్డే కాంబినేషన్ సెట్ అవ్వాల్సింది కానీ... కానీ, డేట్స్ సమస్య కారణంగా ఆగిపోయింది. హరీశ్ శంకర్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’, క్రిష్ జాగర్లమూడి ప్రాజెక్ట్‌లలో మొదట పూజా పేరు వినపడినా వర్కవుట్ అవ్వలేదు. ఒకవేళ ఇప్పుడు ‘ఓజీ 2’ వార్త నిజమైతే... వరుస ఫెయిల్యూర్స్‌తో సైలెంట్ అయిన పూజా హెగ్డేకు, ఈ మెగా ప్రాజెక్ట్ ఒక స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ లా మారబోతోంది.



## ‘దూరదర్శని’ (అమెజాన్ ప్రైమ్)

# మూవీ రివ్యూ

ప్రేమకథలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఇక విలేజ్ నేపథ్యంలోని ప్రేమకథలకు మరింత ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రేమకథగా ‘దూరదర్శని’ కనిపిస్తుంది. సువిక్షిత్ – గీతికా రతన్ జతగా నటించిన సినిమా ఇది. పబ్లిసిటీ పరంగా పెద్ద హడావిడి చేయకుండానే థియేటర్లకు వచ్చింది. అందువలన థియేటర్లలో నిలబడలేకపోయింది. మే 15వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, జూన్ 26వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన పల్లెటూరు .. దాని పేరు ‘మట్టుపల్రు’. అక్కడ హరి (సువిక్షిత్) తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఉంటాడు. ఇంటర్ చదివిన హరి, పై చదువులకు పట్నం వెళ్లాలనే ఆశను చంపుకుంటాడు. ఎందుకంటే ఉన్నకొద్ది పొలాన్ని అమ్మేయడం అతనికి ఇష్టం ఉండదు. అందువలన ఊళ్లోని స్నేహితులతో కలిసి తిరుగుతూ ఉంటాడు. హరి తండ్రి రాజయ్య ఉన్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకుంటూ, పరశురామ్ దగ్గర పనిచేస్తుంటాడు. పరశురామ్ శ్రీమంతుడు .. ఒక రకంగా చెప్పాలంటే ఆ ఊరు మోతుబరి. అతనంటే ఆ ఊళ్లో అందరికి భయమే. అందువల్లనే ఆయన చెల్లెలు వాణి (గీతికా రతన్) వైపు చూసే సాహసం ఎవరూ చేయరు. పట్నంలో చదువుకుంటున్న ఆమె, పరీక్షల తరువాత ఆ ఊరుకు వస్తుంది. అయితే తొలి చూపులోనే వాణిని చూసి హరి మనసు పారేసుకుంటాడు. ‘పేకబాబు’ ఇంట్లో ‘చిత్రలహరి’ చూడటానికి వచ్చిన హరి – వాణి ఇద్దరూ ప్రేమలో పడతారు. తన ఇంటికి ‘చిత్రలహరి’ చూడటానికి వస్తున్న వాణిని పేకబాబు కూడా ఇష్టపడతాడు. అయితే ఆమె హరితో సన్నిహిత్యంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతుంటాడు. కులమతాలపైనే పరువు ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయని బలంగా నమ్మే ఆ ఊళ్లో, తమ ప్రేమ గెలవలేదనే విషయం ఆ జంటకు అర్థమైపోతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది మిగతా కథ. ప్రేమకి కులమతాలు .. ఆర్థికపరమైన స్థితిగతులు ఎప్పటికీ అడ్డుగోడలేనని చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కట్టుబాట్ల కారణంగా, ఈ అంతరాలు మరింత బలంగా కనిపిస్తూ ఉంటాయి. విలేజ్ నేపథ్యంలో ఒక పేదింటి అబ్బాయి .. కలవారి అమ్మాయికి మధ్య నడిచే ప్రేమకథలతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అలాంటి కథతో చేసిన మరో ప్రయత్నంగా ఈ సినిమా నిలుస్తుంది. హీరోయిన్ అన్నయ్య ఒక మోతుబరి .. ఒక రకంగా విలన్ షేడ్స్ తో భయపెట్టే రకం. ఇక అదే ఊళ్లో మరో డబ్బున్న యువకుడు .. అతను కూడా విలన్ షేడ్స్ ను కలిగినవాడే. హీరోయిన్ పై మనసు పారేసుకున్న ఈ డబ్బున్న దొరబాబు, ఆల్రెడీ హీరోయిన్ మనసు దోచుకున్న హీరోపై ద్వేషంతో ఉంటాడు. ఈ నాలుగు పాత్రల చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఇక హీరోయిన్ ను హీరో కలుసుకునేలా చేయడంలోనే తమ జీవితం ధన్యమైందని భావించే మిత్ర బృందం ఇందులోనూ కనిపిస్తుంది. కాకపోతే ఆ టీమ్ చేసే కామెడీ కాసింతైనా పండలేదు. ప్రధానమైన నాలుగు పాత్రలను బలంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అంత కసరత్తు జరగలేదనే విషయం అర్థమైపోతూనే ఉంటుంది. పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన, సన్నివేశాలపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వలన .. ఆశించినస్థాయి అవుట్ పుట్ లేకుండా తేలిపోతుంటాయి. రొటీన్ గా అనిపిస్తూ నిరాశపరుస్తూ ఉంటాయి. 1980లలో బాగా డబ్బున్న ఇళ్లలోనే టీవీలు ఉండేవి. అందువలన చుట్టుపక్కల వాళ్లు వెళ్లి అక్కడ కూర్చునేవారు. అలా పేదింటివాడైన హీరో వెళ్లి వేరే ఇంట్లో టీవీ చూశాడంటే అర్థం ఉంది. కానీ మోతుబరి అయిన పరశురామ్ ఇంట్లో టీవీ లేకపోవడం .. అతని చెల్లెలు కూడా వేరే ఇంటికి వెళ్లి టీవీ చూడటం చిత్రంగా అనిపిస్తుంది. కొత్తగా పెళ్లయిన భద్రం పాత్ర ద్వారా కామెడీని పండించడానికి చేసిన ప్రయత్నం .. కులమతాల అంతరాల కారణంగా శారద బలైపోవడం వంటి ఎమోషనల్ సీన్స్ కూడా పేలవంగా అనిపిస్తాయి. ప్రేమికులు ఒక నిర్ణయం తీసుకునేప్పుడు తమని కన్న వాళ్లను గురించి ఒకసారి ఆలోచన చేయండి అనే సందేశం ఇవ్వడానికి చేసిన ప్రయత్నం బాగుంది. కానీ ఆ సందేశం చుట్టూ ఒక ఆసక్తికరమైన కథను అల్లుకోలేకపోయారు.

# ‘జై భీమ్’ కాంబో రిపీట్.. కేజీఎఫ్ నిర్మాతలతో సూర్య కొత్త సినిమా

తమిళ స్టార్ హీరో సూర్య మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘జై భీమ్’ తర్వాత ఆయన మరోసారి దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో జతకట్టారు. ‘కేజీఎఫ్’, ‘కాంతార’, ‘సలార్’ వంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్లను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం విశేషం. ఈ సినిమా ముహూర్తపు వేడుకను సోమవారం (జూన్ 29) చెన్నైలో ఘనంగా నిర్వహించారు. సూర్య, హోంబలే ఫిల్మ్స్ కాంబినేషన్‌లో ఇదే తొలి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో సూర్య సరసన హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తోంది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎస్.ఆర్. కతిర్ సినిమాటోగ్రాఫర్‌గా, ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పనిచేయనున్నారు. కమర్షియల్ అంశాలతో కూడిన ఒక పవర్‌ఫుల్, గ్రిట్టి డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే రజనీకాంత్‌తో ‘వెట్టైయాన్’ సినిమాను తెరకెక్కించిన జ్ఞానవేల్, వెంటనే సూర్యతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్, సూర్య మూడు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని, సినిమాల ఎంపికలో ఆయన నిర్భయ వైఖరిని ప్రశంసించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే శక్తివంతమైన, అర్థవంతమైన కథలను అందించాలన్నదే తమ ఉమ్మడి లక్ష్యమని నిర్మాత విజయ్ కిరగందూర్ పేర్కొన్నారు. ఇటీవలే ‘కరుప్పు’ చిత్రంతో విజయం అందుకున్న సూర్య, ఈ కొత్త ప్రాజెక్టుతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించనున్నారు.కాగా, ఈ సినిమాపై హోంబలే ఫిల్మ్స్ ఓ ప్రకటన విడుదల చేసింది.

**సూర్యతో మా ప్రయాణం.. గర్వంగా ఉంది: హోంబలే ఫిల్మ్స్**

“ఇది ఆయన నిర్మించుకున్న కెరీర్. ఫ్రేమ్ ఫ్రేమ్‌కూ, సినిమా సినిమాకూ, ఫైట్ ఫైట్‌కూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారు. ఎన్నో నిజ జీవితాల బరువును మోసే పాత్రలలో జీవించారు. ఆయన కెరీర్ ప్రతీసారీ సౌకర్యాన్ని కాదని, ధైర్యాన్ని ఎంచుకుంది. మూడు దశాబ్దాలుగా తెరపై సత్యాన్ని ఆవిష్కరిస్తూ, తెర వెనుక కోట్లాది హృదయాలను గెలుచుకున్నారు. ఈ తరం అత్యంత నిర్భయ నటుడు, ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత భారీ వేదికపైకి



అడుగుపెడుతున్నారు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం మాకు దక్కింది. హోంబలే ఫిల్మ్స్ తరఫున ‘ది వన్ – సూర్య’కు మేము గర్వంగా స్వాగతం పలుకుతున్నాము. సూర్య గారితో మా ఈ ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఆయన నటన, మా నిర్మాణ విలువలు కలిసి ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాము. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం” అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455